సరస్వతీదేవి అలంకరణలో జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లి

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జూబ్లీహిల్స్ లోని పెద్దమ్మతల్లి శుక్రవారం సరస్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. చదువుల తల్లి సరస్వతీదేవి అవతారంలో కొలువుతీరిన అమ్మవారిని దర్శనం చేసుకునేందుకు పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు.

–బంజారాహిల్స్,అక్టోబర్ 20

కల్లు గీతకార్మిక సంఘం ఉత్సవాలు

అభివాదం చేస్తున్న సంఘం అధ్యక్షుడు వెంకటరమణ, బాలగౌని బాల్‌రాజ్ గౌడ్ తదితరులు

చిక్కడపల్లి,అక్టోబర్ 20 : కల్లు గీత కార్మిక సంఘం 66 ఏండ్ల ఉత్సవాలను శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన నీరా, తాటి, ఈత ఉత్పత్తులు, స్వచ్ఛమైన కల్లు, సర్వాయి పాపన్న జీవిత పోరాట చిత్రాల ఎగ్జిబిషన్ ఆకర్షణీయంగా నిలిచాయి. అమరులను యాది చేసుకుని – హక్కుల సాధనకు ముందుకు సాగుదామని కల్లుగీత కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. సంఘం అధ్యక్షుడు మేకపోతుల వెంకటరమణ మాట్లాడుతూ... సంఘం ఏర్పాటు చేసిన నాటి నుంచి గీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఉద్యమాలు నిర్వహించి అనేక హక్కులు సాధించామని తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లకొండ వెంకటేశ్వర్లు, గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ రాష్ట్ర చైర్మన్ బాలగోని బాలరాజ్ గౌడ్, టీపీఎస్‌కే నాయకులు భూపతి వెంకటేశ్వర్లు, వెంకన్న గౌడ్, గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర అంబాల నారాయణ గౌడ్, కేజీకేఎస్ నాయకుడు వెంకట నర్సయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.కృష్ణ స్వామి గౌడ్, సుధాకర్ గౌడ్, మల్లేశం గౌడ్, రాముడు, బబ్బూరి, ఉప్పలయ్య, సాంబయ్య, వీరస్వామి, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఆర్‌పీఎఫ్‌కు హ్యుందాయ్ ఆల్కర్ఘూర్ కార్లు

జూబ్లీహిల్స్, అక్టోబర్ 20 : హ్యుందాయ్ మోటర్ ఇండియా లిమిటెడ్, సికింద్రాబాద్ ఆధ్వర్యంలో దేశ రక్షణలో అహర్నిషలు శ్రమించే సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్) కు అత్యంత విలువైన 6 ఆల్కర్ఘూర్ కార్లను వితరణ చేసింది. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (జీసి,రంగారెడ్డి) అనిల్ మింజ్, కమాండెంట్ ఉత్పల్ మణి బైష్య, డిప్యూటీ కమాండెంట్ సర్వర్ హుస్సేన్, అసిస్టెంట్ కమాండెంట్‌లు కిశోర్ రావు, ఉమాస్కంద్, మోటర్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ రాకేశ్ కుమార్, సికింద్రాబాద్ ఫ్యూజన్ హ్యుందాయ్ సీఓఓ కృతార్థ్ పట్నాయక్, డైరెక్టర్ రత్నప్రభు వల్లూరుపల్లి, ఏజీఎం సేల్స్ అతుల్ శర్మ, హెచ్‌ఎంఐఎల్ ఏసి, తెలంగాణ రీజినల్ మేనేజర్ జి.రామ్‌కుమార్, ఇనిస్టిట్యూషనల్ సేల్స్ మేనేజర్ జాలె శ్రీనివాస్, టీఎస్ఎం ఎ.రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

పెట్ టెలిమెడిసిన్ సర్వీస్ ప్రారంభం

అందుబాటులో ఆన్‌లైన్ వైద్యసేవలు

సిటీబ్యూరో, అక్టోబర్ 20 (నమస్తే తెలంగాణ) : పెంపుడు జంతువుల ఆరోగ్య సంరక్షణలో భాగంగా బంజారాహిల్స్ లోని వెట్‌బీస్ ఆసుపత్రి టెలిమెడిసిన్ సేవలను శుక్రవారం ప్రారంభించింది. 10 రోజుల పాటు ఉచిత వైద్య సేవలు అందజేయనున్నట్లు వెట్‌బీస్ వ్యవస్థాపకుడు డాక్టర్ మురళీధర్ తెలిపారు. టోల్ ఫ్రీ నంబర్ 080–69330000కు కాల్ చేసి, పెంపుడు జంతువుల సమస్యలు తెలియజేస్తే వాటికి కావాల్సిన మెడిసిన్ ప్రిస్క్రిప్షన్ పంపిస్తామన్నారు. పెట్స్ హెల్త్ రికార్డ్స్ నమోదు చేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాగ్ ట్రైనింగ్ సర్వీస్ సంస్థ కమాండో కన్నెల్స్ ఎండీ పిలిప్ బట్ హాజరయ్యారు.

ఒక్కేసి పువ్వేసి చందమామ..

అనురాగ్ యూనివర్సిటీలో...

ఘట్‌కేసర్ మండల పరిధిలోని వెంకటాపూర్‌లో ఉన్న అనురాగ్ యూనివర్సిటీలో నిర్వహించిన బతుకమ్మ వేడుకలకు తెలంగాణ స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ శ్రీదేవసేన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ, యూనివర్సిటీ చైర్మన్ పల్లా రాజేశ్వర్ రెడ్డి, కవి, గేయ రచయిత, గాయకుడు మిట్టపల్లి సురేందర్, యూనివర్సిటీ సీఈవో సూర్యదేవర నీలిమ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చారు. గౌరమ్మను కొలుస్తూ ఆటపాటలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చాన్స్‌లర్ ఎస్ రామచంద్రం, రిజిస్ట్రార్ బాలాజీ, కన్వీనర్ శిరీష, కో కన్వీనర్ సరిత, అనురాగ్ యూనివర్సిటీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

– ఘట్‌కేసర్ రూరల్, అక్టోబర్ 20

పోలీస్ అకాడమీలో..

తెలంగాణ పోలీస్ అకాడమీలో ఘనంగా బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీదేవి, డిప్యూటీ డైరెక్టర్ జానకి షర్మిల, పోలీస్ అకాడమీ డైరెక్టర్ ఏఆర్ శ్రీనివాస్ , జాయింట్ డైరెక్టర్ నవీన్‌కుమార్, డిప్యూటీ డైరెక్టర్లు, అసిస్టెంట్ డైరెక్టర్లు అదితరులు పాల్గొన్నారు.

– బండ్లగూడ,అక్టోబర్ 20

బీఎస్ఎన్ఎల్ భవన్‌లో...

ఆదర్శనగర్‌లోని బీఎస్ఎన్ఎల్ భవన్‌లో శుక్రవారం బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో బీఎస్ఎన్ఎల్ హైదరాబాద్ బిజినెస్ ఏరియా, టెలికాం డిస్ట్రిక్ట్ ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ ఎన్.సుజాత పాల్గొని రంగు రంగు పూలతో పేర్చిన బతుకమ్మలను పూజించారు. అనంతరం మహిళా ఉద్యోగులతో కలిసి పాటలు పాడారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ విజయ్‌కుమార్, పీజీఎం ఏరియా(1,2) చంద్రశేఖర్, ఏజీఎం వెల్ఫేర్ జయశ్రీ, ఎస్‌డీఈలు సుధారాణి , పవన్ దుగ్యాల, డీజీఎంలు,ఏజీఎంలు, పలు అసోసియేషన్ల ప్రతినిధులు, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

– సుల్తాన్‌బజార్, అక్టోబర్ 20

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం విస్తరణ సేవా విభాగం ఆధ్వర్యంలో వర్సిటీ ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన బతుకమ్మ ఉత్సవాల్లో మహిళా ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిన పూల పండుగ సందర్భంగా వీసీ ఆచార్య టి. కిషన్‌రావు శుభాకాంక్షలు తెలిపారు.

– తెలుగు యూనివర్సిటీ

జలమండలిలో...

జలమండలిలో బతుకమ్మ పండుగను శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో జరిగిన సంబురాల్లో మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు. బతుకమ్మను పేర్చి ఆడి పాడుతూ ఉల్లాసంగా గడిపారు.

– సిటీబ్యూరో, అక్టోబర్ 20 (నమస్తే తెలంగాణ)

టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో..

టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా శాఖ అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం ముజీబ్‌హుస్సేనీ ఆధ్వర్యంలో నాంపల్లి గృహకల్పలోని జిల్లా శాఖ కార్యాలయం ఆవరణలో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా టీఎన్జీవో కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళా ఉద్యోగులతో కలిసి బతుకమ్మ పాటలు పాడారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా శాఖ కార్యదర్శి ఎస్ విక్రమ్‌కుమార్, అసోసియేట్ అధ్యక్షుడు కేఆర్ రాజ్‌కుమార్, కోశాధికారి జే.బాలరాజ్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, సభ్యులు సుజాత, గీతా సింగ్, ఖాలేద్ అహ్మద్, వైదిక్ శస్త్ర, శ్రీధర్ నాయుడు, మహ్మద్ వహీద్, వెంకట్‌రెడ్డి, మాజీ కార్యదర్శులు పాల్గొన్నారు.

–సుల్తాన్‌బజార్,అక్టోబర్ 20

నాంపల్లి కోర్టు ప్రాంగణంలో బతుకమ్మ వేడుకలు

నాంపల్లి కోర్టులు, అక్టోబర్ 20 (నమస్తే తెలంగాణ) : నాంపల్లి కోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం కోర్టు ప్రాంగణంలో బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. ఈ వేడుకల్లో తెలంగాణ హైకోర్టు జడ్జీలు జస్టిస్ శ్రీసుధ, సురెపల్లి, జువ్వాడి శ్రీదేవి, ఎమ్.జి.ప్రియదర్శిని హాజరయ్యారు. మహిళా ఉద్యోగులు, న్యాయవాదులు బతుకమ్మలను పేర్చి కోలాటాలతో నృత్యం చేశారు. నాంపల్లి కోర్టుకు చెందిన మెజిస్ట్రేట్లు, జిల్లా జడ్జి ప్రేమావతి పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి న్యాయవాదులు, జిల్లా జడ్జీలు రమాకాంత్‌రావు, బార్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పరిశోధనలపై జేఎన్‌టీయూ స్పెషల్ ఫోకస్

పరిశోధన థిసీస్ దాఖలుకు నవంబర్ 15 వరకు గడువు పొడిగింపు

సిటీబ్యూరో, అక్టోబర్ 20 (నమస్తే తెలంగాణ) : జేఎన్‌టీయూ పరిశోధనలపై ప్రత్యేక దృష్టి పెడుతున్నది. నాణ్యమైన పరిశోధనలు ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్న ఉద్దేశంతో అధికారులు కృషి చేస్తున్నారు. ఈ క్రమంలో పరిశోధన విద్యార్థులకు తమ పరిశోధన అంశాలను ఎలా ఎంపిక చేసుకోవాలి? పరిశోధన అంశాలపై గతంలో ఎవరూ కూడా పరిశోధనలు చేసే అంశాలను తిరిగి ఎంపిక చేసుకోవడం వల్ల కలిగే నష్టాలు? టెక్నాలజీ రంగంలో వస్తున్న మార్పులు, అవి సమాజానికి ఏ విధంగా ఉపయోగపడుతాయి? ఎలా వాటిని ఉపయోగించుకోవచ్చు? వంటి పలు రకాల అంశాలపై విద్యార్థులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నారు. ఇందుకోసం పరిశోధన అవగాహన సదస్సులతో పాటు సీనియర్ ప్రొఫెసర్లు, ఐఐటీ, ఎన్ఐటీలు, ఇతర దేశాలకు చెందిన యూనివర్సిటీల్లో ఉన్న సీనియర్ ప్రొఫెసర్లతో విద్యార్థులకు పరిశోధనల పట్ల అవగాహన కల్పిస్తున్నారు. ఈ క్రమంలో నకిలీ థిసీస్‌కు, డూప్లికేషన్, కాపీ కొట్టడం వంటి వాటిని పూర్తిగా రూపుమాపి, సరికొత్త అంశాలనే పరిశోధన అంశాలుగా ఎంపిక చేసుకోవడానికి యూనివర్సిటీ అధికారులు అవకాశం కల్పిస్తున్నారు.

థిసీస్ దాఖలుకు నవంబర్ 15 వరకు గడువు పొడిగింపు..

పరిశోధన విద్యార్థులు తయారు చేసిన థిసీస్‌లను దాఖలు చేయడానికి నవంబర్ 15 వరకు గడువు పొడిగించారు. అయితే ముందుగా ప్రకటించిన ప్రకారం ఈ నెల 18 వరకు థిసీస్ దాఖలుకు గడువు విధించారు. అయితే గడువు ముగియడంతో విద్యార్థుల విజ్ఞప్తి మేరకు థిసీస్‌ను దాఖలు చేయడానికి యూనివర్సిటీ అధికారులు గడువును పొడిగించారు.